ఎన్నికల ముందు వైసీపీ నాయకులు చెబుతున్న మాట ఒక్కటే.. మీకు ఎవరు మంచి చేశారో వారికే ఓటేయాలని.. మంచి చేయడం ఏమిటి.. ఒక సీఎంగా ప్రజల బాగోగులు చూసుకోవడం ఆయన విధి.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమూ ఆయన బాధ్యతే.. ఏ సీఎం వచ్చినా అదే చేస్తారు.. జగన్ పాలనకు ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదా.. ఆరోగ్యశ్రీ లేదా పింఛన్లు లేవా.. పంట నష్టపరిహారాలు లేవా అన్నీ ఉన్నాయి..నాటి పథకాల పేర్లు మార్చి నేడు ప్రచార ఆర్భాటానికి ఆయనే చేసినట్టు చెప్పుకుంటున్నారు.. మన మాట తప్పని.. మడమ తిప్పని సీఎంగారు.. ఆ పథకాలైనా సక్రమంగా అమలు చేశారా అంటే అదీ లేదు.. ఈ ఏడాది ఎన్నికల ముందు చేస్తూ సుమారు ఐదు పథకాలకు బటన్ నొక్కేశారు కానీ.. నేటికీ రూపాయి పడలేదు.. దీంతో గత రెండు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.. ఈ రోజుకీ బ్యాంకుల ముందు క్యూకడుతూనే ఉన్నారు పాపం జనం..

ఇస్తానంటారు.. ఇవ్వరంతే!



నేను ఐదు ఎకరాలు కౌలు తీసుకుని సాగు చేశా. గత సార్వాలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో పంట పూర్తిగా నష్టపోయా. అదే సీజన్‌లో పరిహారం అందుతుందని భావించా. మార్చిలో సీఎం బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. డబ్బులు మాత్రం మా ఖాతాల్లో పడలేదు. **- దువ్వా తాతాజీ, కౌలురైతు, గొల్లప్రోలు**



ఒక్క రూపాయీ జమ కాలేదు!

- బటన్ నొక్కారు.. సొమ్ములు పడలేదు
- ఖాతాల్లో డబ్బులు వేశామంటూ ఆర్భాటం
- ప్రతి సభలోనూ జగన్ ప్రగల్భాలు
- నెలలు గడుస్తున్నా ఎదురుచూపులే
- బ్యాంకులు చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ

పిఠాపురం, మే 3: బటన్ నొక్కితే సొమ్ములు నేరుగా మీ ఖాతాల్లోకి పడిపోతున్నాయి.. ఇది జగన్ మాట. నమ్మొద్దు.. అంతా మోసం గురూ ఒక్క రూపాయి పడలేదు.. ఇది లబ్ధిదారుల మాట.. సీఎం హోదాలో జగన్ ఎక్కడికి వెళ్లి సభ పెట్టినా, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జరిగిన సిద్ధం సభలు, ప్రస్తుతం జరుగుతున్న ప్రచార సభల్లో చెప్పే మాట ఒక్కటే ..దేశంలో ఎక్కడా లేని విధంగా కోట్లాది రూపాయలను బటన్ నొక్కి నేరుగా మీ ఖాతాల్లో వేస్తున్నాం అని.. వాస్తవంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రోజులు గడిచిపోయాయి. నెలలు దాటుతున్నాయి. ఈ ఏడాది బటన్ నొక్కినా నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చేరలేదు. ఈ ఏడాది జనవరి 1 నుంచి మార్చి 18న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ తొమ్మిది పథకాలకు జగన్ బటన్‌లు నొక్కారు. ఇందులో ఐదు పథకాలకు సంబంధించి నేటి వరకూ ఒక్క రూపాయి లబ్ధిదారుల ఖాతాలకు జమ కాలేదు. ఆసరా నిధులు 50 శాతం మందికి మాత్రమే పడ్డాయి. సీఎం బటన్ నొక్కి మీ ఖాతాలకు సొమ్ములు వేశామని చెప్పడంతో గత రెండు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అసలు సొమ్ములు విడుదల చేస్తే కదా పడేది అంటూ కొందరు బ్యాంకర్లు సమాధానమిస్తున్నారు. ప్రచారంలో భాగంగా అధికార పార్టీ నాయకులు తాము వివిధ పథకాల కింద సొమ్ములు వేశామని చెబుతుంటే ఖంగుతినడం లబ్ధిదారుల వంతవుతోంది. పలు చోట్ల వైసీపీ నేతలను ప్రజలు ఇదే విషయంపై నిలదీస్తున్నారు.

ఆసరాకు..100 రోజులు

డ్వాక్రా సంఘాలు 2019 ఏప్రిల్ నాటికి తీసుకున్న రుణ మొత్తాలను మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మడతేశారు. దాన్ని నాలుగు విడతల్లో తీరుస్తామంటూ ప్రకటించి ఏటా కొంత మొత్తంలో నిధులను విడుదల చేయడం ఆరంభించారు. నాలుగో విడతగా నిధులను జనవరి 23న జగన్ విడుదల చేశారు. కాకినాడ జిల్లాలో 37,525 గ్రూపుల్లోని 3,76,071 మంది మహిళలకు రూ.300.74 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 31,093 సంఘాలకు రూ.254.25 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 32,707 సంఘాలకు రూ.276.47 కోట్లు బటన్ నొక్కి విడుదల చేసినట్టు ప్రకటించారు. ఈ మేరకు వైసీపీ నాయకులు సమావేశాలు పెట్టి మహిళలను భారీగా తరలించి ప్రచారం చేశారు. నమూనా చెక్కులు అందించారు. నేటికీ 50 శాతం లబ్ధిదారులకు సొమ్ములు పడలేదు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా మాత్రమే నిధులు రావడంతో ఆయా వర్గాలకే సొమ్ములు పడినట్టు చెబుతున్నారు. మిగిలిన వారికి 100 రోజులైన్నా సొమ్ములు రాలేదు.

దా..రుణం.. ఏడు నెలలైంది?

బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రూ.లక్ష లోపు వ్యవసాయ స్వల్పకాలిక పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలను వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తే వడ్డీ మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం తిరిగి చెల్లిస్తోంది. ఏటా అక్టోబర్‌లో ఈ నిధులు విడుదల చేసేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న బటన్ నొక్కి విడుదల చేశారు. ఐదు నెలలు ఆలస్యంగా నిధులు విడుదల చేసినా లబ్ధిదారులకు అందలేదు. వడ్డీ రాయితీ కాకినాడ జిల్లాలో 34,270 మంది రైతులకు రూ.5.35 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 35,707 మంది రైతులకు రూ. 5.37 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 30,714మందికి రూ5.86 కోట్లు సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. రెండు నెలలు దాటినా ఒక్కరికా రూపాయి పడలేదు.

జగనన్న విద్యాదీవెనేది..

వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన ద్వారా ప్రభుత్వం ఫీజుల సొమ్మును వాయిదా రూపంలో వారి తల్లుల ఖాతాలకు జమ చేస్తోంది. ఈ ఏడాది మొదటి విడతగా మార్చి 1న కాకినాడ జిల్లాలోని 41, 474 మంది విద్యార్థులకు సంబంధించి 37,196 మంది త ల్లుల ఖాతాలకు రూ.28.84 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా లో 33,502 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.25.80 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 31,926 మంది విద్యార్థులకు రూ.24.09 కోట్లను సీఎం జగన్ బటన్ నొక్కి తల్లుల ఖాతాలకు మళ్లించినట్టు చెప్పారు. ఈ సొమ్ములు తల్లుల ఖాతాలకు చేరలేదు. దీంతో ఎక్కడికక్కడ విద్యా సంస్థలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. రెండు నెలలు దాటినా ఇంకా సొమ్ములు పడలేదు.

అన్నదాతకు పరిహారమేది..

సార్వా, రబీ సమయాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు అదే సీజన్ ముగిసేలోగా పంట నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తామని జగన్ ప్రగల్భాలు పలికారు. కరవు కారణంగా నష్టపోయిన వారికి పరిహారం ఎగ్గొట్టారు. గతేడాది డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో సార్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారందరికీ సీజన్ ముగిసేలోగా పరిహారం అందిస్తామని ప్రకటించారు. రెండు నెలలు ఆలస్యంగా మార్చి 6న కాకినాడ జిల్లాలో 13,540 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 29,370 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.23.05 కోట్లు, కోనసీమ జిల్లాలో 11,669 హెక్టారలో పంటలు నష్టపోయిన 23,379 మంది రైతులకు రూ.20.25 కోట్లు, తూర్పుగోదావరి జిలాల్లో 11,854 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 31,926 మంది రైతులకు 17.83 కోట్లను జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. 20 రోజులు గడిచినా పంట నష్టపరిహారం రాలేదు.

చేయూత రాలేదు



వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,500 మా ఖాతాలకు జమ చేశామన్నారు. మీటింగ్‌కు రమ్మని పిలిచి మీ డబ్బులకు జగన్ బటన్ నొక్కారు, సొమ్ములు వస్తాయని చెప్పారు. రెండు నెలలు కావస్తోంది. నేటికీ రాలేదు. బటన్ నొక్కినా నిధులు పడకపోవడం ఏంటో మరి.
వి.చక్రమ్మ, పిఠాపురం

వైఎస్‌ఆర్ చేయూత ఏదన్నా?

వైఎస్‌ఆర్ చేయూత కింద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన 45-60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మహిళలకు ఏటా రూ.18,500 అందిస్తున్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మూడు నెలలు ముందుగానే సీఎం జగన్ బటన్ నొక్కే శారు.కాకినాడ జిల్లాలో 1,01,759 మంది మహిళలకు రూ.190.80 కోట్లు, కోనసీమ జిల్లాలో 89,619 మందికి 168.03 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో 85,311 మందికి 159.96 కోట్లు విడుదల చేసినట్టు ప్రకటించారు. 56 రోజులు గడిచినా మహిళల ఖాతాలకు ఒక్క రూపాయి జమ కాలేదు. ఎన్నికల పుణ్యమా అని తమకు డబ్బులు ముందే ఇస్తున్నారని భావించిన మహిళలకు నిరాశే మిగిలింది.

అందని ఈబీసీ నేస్తం..

ఈబీసీ నేస్తం ద్వారా అగ్రవర్ణాల పేదలకు ఏటా రూ.15వేలు అందించే పథకం కింద సీఎం జగన్ మార్చి 14న బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. జిల్లాలో 9,516 మందికి రూ.14.27 కోట్లు, కోనసీమ జిల్లాలో 11,496 మందికి రూ.17.24 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 16,771 మందికి రూ.25.15 కోట్లు వారి ఖాతాలకు జమ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటివరకూ ఖాతాలకు సొమ్ములు చేరలేదు. బటన్ నొక్కి 50 రోజులు గడిచినా నేటికి అదే పరిస్థితి.

ప్రచార ఆర్భాటమే..

వివిధ పథకాల కింద బటన్ నొక్కి నిధులు విడుదల ప్రచార ఆర్భాటం కోసం తప్ప ఆయా వర్గాలకు లబ్ధి చేకూర్చాలన్నది జగన్ లక్ష్యం కాదని పలువురు విమర్శిస్తున్నారు. నిధుల విడుదలను ఎన్నికల తేదీ ముందు వరకూ నిలిపివేసి రెండు, మూడు రోజులు ముందుగా విడుదల చేసి రాజకీయంగా లబ్ధి పొందాలన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు. ఇలా చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని తెలిసినా అదే మార్గాన్ని ఎంచుకున్నారు. ఒక వేళ ఎవరైనా అందుకు అభ్యంతరం తెలిపితే నెపాన్ని ప్రతిపక్షాలపైకి నెట్టి వేయాలని వైసీపీ నేతలు భావిస్తున్నట్టు చెబున్నారు. పింఛన్ లబ్ధిదారులను కష్టాలు పాలు చేస్తున్నట్టే.. బటన్ నొక్కి నిధులు విడుదల చేశామని చెప్పి ఆయా పథకాల లబ్ధిదారులను జగన్ బ్యాంకులు చుట్టూ తిరిగేలా చేస్తున్నారు.

ఐదేళ్లుగా అన్నదాతకు వ(శ్రీ)యే!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/సామర్లకోట, మే 3: ధాన్యం సేకరణ ఏటికేడు తీసికట్టే ఉంటోంది. ప్రతి సీజన్‌లోనూ ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం లక్షల మెట్రిక్ టన్నుల్లో ఉంటుంది. కొనుగోలు చేసేది తూతూమంత్రంగా వేల టన్నుల్లోనే కొనుగోలు చేసి మమ అనిపిస్తున్నారు.తాజా దాళ్వా సీజన్‌లోను ఇదే తంతు కొనసాగుతోంది.అరకొరగా సేకరించిన ధాన్యానికి సొమ్ములు జమ చేయడంలో వైసీపీ ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపెడుతోంది. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ నీటిమూటలుగా మిగిలిపోయాయి. టీడీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసినా డబ్బు ఎప్పుడు అందుతుందో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 55,315 హెక్టార్లలో వరిసాగు ఉండగా ఈ రబీ సీజన్‌లో 4.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో 3.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సివిల్ సప్లయిస్ ద్వారా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 94 శాతం కోతలు పూర్తయి ధాన్యం కళ్లాలోనూ, రోడ్లపై, మిల్లుల వద్ద ఉంది. ప్రభుత్వం ఇప్పటి వరకూ కేవలం 82,871 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. దీనికి రూ.410 కోట్లకు పైగా రైతులకు చెల్లించాల్సి ఉండగా, ఇంత వరకూ రూ.155 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా రూ.255 కోట్లు పెండింగ్ ఉంది. అది కాకుండా 2.4 లక్షల టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇదంతా ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియని పరిస్థితి. కాకినాడ జిల్లాలో ప్రస్తుత దాళ్వా సీజన్‌లో రైతుల నుంచి 1.92 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం కొనుగోలు చేయాలని సివిల్ సప్లయ్ ద్వారా ప్రభుత్వం నిర్ధేశించింది. శుక్రవారం నాటికి జిల్లాలో సీజన్ మొదలై నెల రోజులపైబడింది. కొనుగోలు చేసింది కేవలం 16,235 మెట్రిక్ టన్నులు మాత్రమే. రైతులకు రూ.35.48 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికి రూ.8.97 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.26.51 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

'తూర్పు'న రూ.255 కోట్లు.. కాకినాడలో రూ.27 కోట్లు బకాయి



ఎప్పటికి కొంటారో : బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

నేడు కాకినాడలో చంద్రబాబు పర్యటన



కాకినాడ సిటీ, మే 3: టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం కాకినాడలో పర్యటించనున్నారు. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారు. ఏలూరు జిల్లా నూజివీడు నుంచి హెలికాఫ్టర్‌లో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు కరప మండలం నడకుదురులో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నడకుదురు జంక్షన్‌లోని కుసుమసత్య కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటలకు రోడ్‌షోగా బయలుదేరి కాకినాడ సిటీ అన్నమ్మ ఘాటీ సెంటర్, జగన్నాథపురం బ్రిడ్జి మీదుగా సినిమారోడ్ సంతచెరువు సెంటర్ వద్ద ప్రజాగళం సభ ప్రదేశానికి చేరుకుంటారు. అక్కడ పార్టీ నాయకుల పరిచయాలు, పార్టీలో పలువురి చేరికలు ఉంటాయి. అనంతరం రాత్రి 8.30 నుంచి 9.55 గంటల వరకు సంతచెరువు సెంటర్‌వద్ద ప్రజాగళం సభ జరగనుంది. రాత్రి 10 గంటలకు ఏడీబీ రోడ్‌లోని కొప్పవరం జంక్షన్‌లో బస చేస్తారు. 5వ తేదీ ఉదయం 9.20 గంటలకు హెలిపాడ్ వద్దకు చేరుకుని 9.30 గంటలకు హెలికాఫ్టర్‌లో బయలుదేరి వెళ్లనున్నారు.

6న ప్రధాని మోదీ రాక



- రాజమహేంద్రవరం రూరల్ వేమగిరి వద్ద బహిరంగ సభ
- భారీగా ఏర్పాట్లు- ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు

7

తప్పని అగచాట్లు

- పింఛన్ లబ్ధిదారులకు కొనసాగిన కష్టాలు

పిఠాపురం/గొల్లప్రోలు/గండేపల్లి, మే 3: పింఛన్ లబ్ధిదారుల అగచాట్లు కొనసాగుతున్నాయి. బ్యాంకులవద్ద పడిగాపులు పడుతూనే ఉన్నారు. తమ ఖాతాల్లో సొమ్ములు పడ్డాయో లేదో చూసుకోవడంతోపాటు ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన పత్రాలు అందించేందుకు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు, గండేపల్లి మండలంలోని బ్యాంకులకు అధికంగా లబ్ధిదారులు తరలివచ్చారు. పలువురికి బ్యాంకు ఖాతాలకు సొమ్ములు వేశామని చెప్పడంతో బ్యాంకులకు వచ్చి చూసుకుని పడకపోవడంతో ఏం జరిగిందో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తిరిగి సచివాలయాలకు వెళ్తే మళ్లీ బ్యాంకులకు వెళ్లాలని చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండుటెండలో తిరగలేక లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడ్డారు.



గండేపల్లిలో బ్యాంకువద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

7,56,845మందికి ఓటరు స్లిప్‌లు పంపిణీ: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే3: ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు 7,56,845మందికి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశామని కలెక్టర్ నివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒకప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఏడు శాసన సభ నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి బీఎల్‌ఓలు ఓటరు స్లిప్‌లు ప్రతి ఇంటికి వెళ్లి పంపిణీ చేశారన్నారు. జిల్లాలో 16,34,122మంది ఓటర్లకుగాను 7,56,845మందికి ఓటరు స్లిప్‌లు పంపిణీ పూర్తి చేశామన్నారు.

టీ టైం ఉదయ్‌గా ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నాను



- నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- ఉమ్మడి మేనిఫెస్టో ప్రజల్లోకి దూసుకుపోయింది - వివరాలు 7లో
- కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్


టీటైం ఉదయ్‌గా ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నాను. ప్రజలు సంక్షేమంతో పాటు అభివృద్ధి కావాలని కోరుకుంటున్నారంటున్న కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌తో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక పర్యవేక్షణ: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ) మే 3: జిల్లాలో 356 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించామని కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. కలెక్టరేట్ ఎస్‌వీసీ సెంటర్‌లో శుక్రవారం ఆయన ఇతర అధికారులతో కలిసి ఎన్నికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాండమైజేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ కేంద్రాలు కేటాయించామన్నారు. కేంద్రప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న 415మందిని మైక్రో అబ్జర్వర్లుగా నియమించామన్నారు. జిల్లాపరిశీలకులు గణేష్, రాజేష్‌జోగ్‌పాల్, శివకుమార్,ఎస్పీ సతీష్, డీఆర్వో తిప్పేనాయక్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ పాలనే కూటమి లక్ష్యం

- చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి
- కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు



సిటీ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ఇన్‌చార్జి సుజయ్‌కృష్ణ, పక్కనే ఎమ్మెల్యే అభ్యర్థి కొండబాబు

కాకినాడ సిటీ, మే 3: ప్రజాసంక్షేమ పాలనే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల పర్యటన సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కొండబాబు అధ్యక్షతన కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఇన్‌చార్జి సుజయ్‌కృష్ణ రంగారావు, కోఆర్డినేటర్ తోటనవీన్, జనసేన నాయకుడు ప్రెసింగి ఆదినారాయణ, బీజేపీ నాయకుడు గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండబాబు, ఇతర నేతలు మాట్లాడుతూ జగన్ పాలనంతా పన్నులు, ధరలు పెంచుకుంటూ పోవడం తోనే సరిపోయిందన్నారు. దోచుకో.. దాచుకో నినాదంతోనే ఐదేళ్లు గడిచాయన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ బిల్లులు, పన్నులు, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. కాకినాడలో శనివారం జరిగే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నగరఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, మాజీ మేయర్ సుంకర పావని, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం

కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబును గెలిపించాలని డివిజన్లలో పార్టీశ్రేణులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం సాగించారు. 34వ డివిజన్‌లో వనమాడి శివప్రసాద్ పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. 40వ డివిజన్‌లో వనమాడి హేమంత్ కుమార్ ప్రచారంచేశారు. సైకిల్‌గుర్తుపై వనమాడి కొండబాబును ఎమ్మెల్యేగా గెలిపించాలని, గ్లాసుగుర్తుపై ఓటు వేసి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు.

'ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తాం'

కాకినాడ క్రైం, మే 3: ప్రజల ఆస్తులను దోచుకునేందుకు వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటి లింగ్ యాక్ట్ జీవోను కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే రద్దు చేస్తామని కాకినాడ సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు వెల్లడించారు. శనివారం ఆయన కాకినాడ బార్ అసోసియేషన్‌కు వెళ్లి న్యాయవాదులను మర్యాదపూర్వకంగా కలిసి ఓటు అభ్యర్థించారు. ప్రజల స్థిరాస్తులకు విఘాతం కలిగించే ల్యాండ్ టైటిల్ యాక్ట్ జీవో రద్దుకు న్యాయ వ్యవస్థ సహకరించాలని కొండబాబు కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు జవహర్ అలీ, కొటికలపూడి శ్రీనివాస్, కాకర వెంకటేశ్వరరావ్, బొగ్గవరపు గోకుల కృష్ణ, దండుప్రోలు నాగబాబు, చెక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాకినాడ బార్ అసోసియేషన్ సభ్యులతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కొండబాబు



ఎన్‌ఆర్‌ఐ కిషోర్ బలుసు

అరాచకాలు చూడలేక..

- కూటమికి మద్దతుగా ఆస్ట్రేలియా నుంచి వచ్చాం..
- చంద్రబాబు సారథ్యంలోనే ఉద్యోగాల కల్పన

అలమూరు, మే 3: రాష్ట్రంలో జరుగుతున్న అరాచకం చూడలేక విదేశాల్లో ఉన్న వారందరూ ఇక్కడి వచ్చి టీడీపీ తరపున ప్రచారం చేస్తున్నట్టు ఎన్‌ఆర్‌ఐ (ఆస్ట్రేలియా) కిషోర్ బలుసు చెప్పారు. గత 20 రోజులుగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ప్రచారం చేశామని, ప్రస్తుతం సొంత నియోజకవర్గం కొత్తపేటలో కూటమి అభ్యర్థి బండారు సత్యానంద రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో శుక్రవారం జరిగిన బండారు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కిషోర్ మీడియాతో మాట్లాడారు. తనది ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామం అని, 20ఏళ్ల క్రితమే ఆస్ట్రేలియాలో స్థిరపడ్డామన్నారు. రాష్ట్రంలో జగన్ అరాచక పాలనతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. ఏపీలోని యువతకు లక్ష ఉద్యోగాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చంద్రబాబునాయుడుతో ఆదివారం విశాఖలో ఎన్‌ఆర్‌ఐలతో జరిగే సమావేశంలో తాము లక్ష ఉద్యోగాల హామీ ఇస్తామని కిషోర్ చెప్పారు.

దటీజ్ బాలయోగి..

ఉప్పలగుప్తం:



లోక్‌సభ సభ్యునిగా ప్రజలతో మమేకమైన తీరు జీఎంసీ బాలయోగికి మాత్రమే ప్రత్యేకం. ప్రస్తుతం ఎమ్మెల్యేలకు, ఎంపీలకు మధ్య సంబంధాలు అంతంతమాత్రమే. తమ నియోజకవర్గాల్లో కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు ఎంపీలను దూరంగానే ఉంచుతున్నారు. ఒకే పార్టీకి చెందిన వారైనా గ్రూపు రాజకీయాలు మామూలే. కార్యకర్తలు సైతం రెండు గ్రూపులుగా విడిపోవడం మనం చూస్తున్నాం. బాలయోగి విషయానికి వస్తే ఆయన రూటే సెపరేటు. ప్రతివారం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన ఎమ్మెల్యేతో కలిసి తిరిగేవారు. సమస్యలపై ఆరా తీసేవారు. ఎవరైనా ఆయనను ఆహ్వానిస్తే స్థానిక ఎమ్మెల్యేను అడిగారా అని ప్రశ్నించేవారు. సమావేశాల్లో స్థానిక సర్పంచ్ లేకపోతే ఆయన వచ్చే వరకు కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ససేమిరా అనేవారు. లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నా ఇదే పద్ధతిని ఆయన అవలంబించారు. అమలాపురం కాటన్ గెస్ట్ హౌస్‌లో రాత్రి సమయాల్లో పాత్రికేయులతో ముచ్చటించేవారు. విషయాలు తెలుసుకునేవారు. దేశ రాజధాని నుంచి నియోజకవర్గానికి వచ్చిన ప్రతిసారీ తన వెంట ఒక కేంద్ర మంత్రిని తీసుకుని వచ్చేవారు. కోనసీమలో ప్రధాన సమస్యలు ఆ రోజు పత్రికల్లో ప్రచురితమయ్యేలా పాత్రికేయులకు ఉప్పందించేవారు. మరుసటి రోజు సమావేశంలో పత్రికలను మంత్రి ముందుంచేవారు. తక్షణం సమస్య పరిష్కారానికి మంత్రి నుంచి నిధుల మంజూరు సాధించేవారు. ఏ గ్రామానికి వెళ్లినా ఎక్కువ మందిని పేర్లతో పలకరించేవారు. లోకసభ స్పీకర్‌గా కూడా అదే బాణీ కొనసాగించారు. దటీజ్ బాలయోగి.



అప్పటి అల్లవరం ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరితో కలిసి గ్రామాల్లో పర్యటిస్తున్న బాలయోగి

ఓటర్లు / వస్తున్నారు..!



వయ్యా పోలింగ్ బూత్

వలస ఓటర్లకు గాలం..

- అన్వేషణలో ప్రధాన రాజకీయ పార్టీలు
- ప్యాకేజీలు ఇచ్చేందుకు అభ్యర్థులు సిద్ధం
- ఇప్పటికే రైలు, బస్ టిక్కెట్లు రిజర్వేషన్లు
- ఎన్నికలపై ఆసక్తి ప్రదర్శిస్తున్న వలస ఓటర్లు
- బంధుమిత్రులతో రాయబారాలు
- వలస ఓటర్లకు ప్రత్యేక ప్యాకేజీలు..

అమలాపురం టౌన్, మే 3: దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఎన్నికల తేదీ నాటికి ఆయా నియోజకవర్గాలకు తీసుకువచ్చే విధంగా రాజకీయ పార్టీల అభ్యర్థులు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ సహా వివిధ కీలక నగరాలు, పట్టణాలకు వలసలు వెళ్లిన కుటుంబాల ఓట్లను అన్వేషించడంపై టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు దృష్టి సారించారు. ఏ ఒక్క ఓటునూ వదులుకోకూడదని పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ప్యాకేజీల పరంగా ఆయా ప్రాంతాల్లోని ఓటర్లను తమ తమ నియోజకవర్గాలకు రప్పించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న పేర్ల ఆధారంగా వారు ఎక్కడున్నదీ బంధుమిత్రులను అడిగి తెలుసుకుంటూ వారిని రప్పించేందుకు రైల్వే, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులకు కూడా అప్పుడే టిక్కెట్లు రిజర్వేషన్ చేయించే పనిలో అభ్యర్థుల తాలూకా అనుచరగణాలు నిమగ్నమయ్యాయి.

అక్కడి వారు ఇక్కడకు





ఈ నెల 13న పోలింగ్ జరగనుంది. జిల్లాలో అమలాపురం లోక్‌సభతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలు జరుగుతున్నందున అభ్యర్థులు ప్రతి ఓటునూ విలువైనదిగా పరిగణిస్తున్నారు. ఎంత దూరాన ఉన్నా వచ్చి ఓటు వేయాలని వారి అనుచరులు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ముమ్మిడివరం, కొత్తపేట అసెంబ్లీల టీడీపీ అభ్యర్థులు దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావు ఇప్పటికే హైదరాబాద్ వెళ్లి వలస ఓటర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈసారి కచ్చితంగా జిల్లాకు వచ్చి ఓట్లు వేస్తామని వారంతా హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన యువకులు రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని గుర్తించి స్వచ్ఛందంగానే ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాకపోవడంతో ఐదేళ్ల కాలంలో జిల్లా నుంచి వేలాది కుటుంబాలు హైదరాబాద్‌తో పాటు వివిధ ముఖ్య పట్టణాలకు వలస వెళ్లి ఉపాధి పొందుతున్నారు. వారితో పాటు ఉద్యోగ రీత్యా బెంగళూరు, చెన్నై, ముంబై వంటి ముఖ్య నగరాల్లో ఉన్న వారిని గుర్తించి వారి ఓట్లు వేయించుకునేందుకు ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. చివరకు విదేశాల్లో ఉన్న వారిని స్వదేశానికి రప్పించే ప్రయత్నాలు ఒకపక్క జరుగుతుండగా.. పార్టీలపై అభిమానంతో సెలవులు పెట్టుకుని వచ్చేందుకు మరికొందరు సిద్ధపడుతున్నారు. కోనసీమ వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లోని వలస ఓటర్లను గుర్తించే పనిలో కొన్ని బృందాలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌కు వలస వెళ్లిన వారి సంఖ్య 50 వేలు వరకు ఉండవచ్చని అంచనా. వారితో పాటు దేశ, విదేశాలు, వివిధ పట్టణాల్లో ఉన్నవారి సంఖ్య కూడా వేలల్లోనే ఉంది. వారిలో కొందరితో ఫ్యామిలీ ప్యాకేజీతో పాటు వ్యక్తిగత ప్యాకేజీలు మాట్లాడుకుని రప్పిస్తున్నారు. రైలు, బస్సు టిక్కెట్లను అడ్వాన్స్ బుకింగ్ చేస్తూ వారిని ఆకట్టుకుంటున్నారు. ఒక్కో నియోజకవర్గంలో వలస ఓటర్లు 6 వేల నుంచి 10 వేలకు పైగా ఉండవచ్చని రాజకీయ పార్టీల అంచనా. కచ్చితంగా తమ పార్టీకి ఓటేస్తారనే నమ్మకం ఉన్న వ్యక్తులను వారి బంధువుల ద్వారా గుర్తించి రప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రాజోలు, కొత్తపేట, గన్నవరం, ముమ్మిడివరం, అమలాపురం, మండపేట నియోజకవర్గాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న టీడీపీ, వైసీపీ, జనసేన అభ్యర్థులు ప్యాకేజీలు సిద్ధం చేసి వలస ఓటర్లను రప్పించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆయా పార్టీల తరపున అభ్యర్థించడం ద్వారా ఓటర్లు ఇక్కడకు వస్తే వారికి ఖర్చులు తగ్గడంతో పాటు కుటుంబ సభ్యులతో రెండు రోజుల పాటు గడిపే అవకాశం ఉండటంతో వారు కూడా ఈ ఎన్నికల పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఈ సారి జరిగే ఎన్నికలకు కొందరు అభిమానంగా తామే వచ్చి ఓట్లు వేస్తామని అభ్యర్థులకు వర్తమానాలు పంపిస్తున్నారు. మరికొందరికైతే నజరానాలు ఇచ్చేందుకు కూడా నాయకులు సిద్ధపడుతున్నారు.

ఖైదీలకూ ఓటు హక్కు



పెద్దాపురం, మే 3 : రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయులకు ఓటుహక్కు ఉంటుంది. అయితే వివిధ కారణాలతో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటుహక్కు ఉంటుందా.. ఉండదా అనే ప్రశ్న చాలామందికి తలెత్తుతుంది. అయితే ఖైదీలు కూడా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశముంది. పలు నేరాల్లో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రివెంటీవ్ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ తాము ఓటర్లమని పోలింగ్ బూత్, ఓటరు క్రమసంఖ్యతో ఓటువేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.



నల్లా రెడ్డినాయుడు | కుసుమ కృష్ణమూర్తి | బీఎస్ మూర్తి | ఏజేవీబీ మహేశ్వరరావు | జీఎంసీ బాలయోగి | జి.విజయకుమారి | కేఎస్‌ఆర్ మూర్తి | జీవీ హర్షకుమార్



పండుల రవీంద్రబాబు | చింతా అనురాధ

అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం



పార్లమెంట్ నమూనాలో ఆర్డీవో కార్యాలయం

(ఆంధ్రజ్యోతి-అమలాపురం):

పార్లమెంట్‌లో అసెంబ్లీలు

అమలాపురం(ఎస్సీ), కొత్తపేట, రామచంద్రపురం, మండపేట, రాజోలు(ఎస్సీ), పి.గన్నవరం(ఎస్సీ), ముమ్మిడివరం.

చమురు క్షేత్రాలతో అంతర్జాతీయ ఖ్యాతి

9 సార్లు కాంగ్రెస్, ఆరుసార్లు టీడీపీదే హవా..

దళిత యోధుల గడ్డ

ప్రముఖ నేతలను అందించిన అమలాపురం పార్లమెంట్

విశిష్టతల సమాహారం

అమలాపురం ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గం అపార సంపదనిచ్చే చమురు క్షేత్రాల ద్వారా అంతర్జాతీయ చిత్రపటానికెక్కింది. ఆప్యాయతా అనురాగాలను పంచే ప్రజలు ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఒక వైపు సముద్ర తీరం, మూడువైపులా గోదావరి నదీపాయల నడుమ కేరళ తరహా అందాలతో పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేసే సొగసులు నియోజకవర్గం సొంతం. పాడి పంటలకు పుట్టినిల్లు. వరి, కొబ్బరితో పాటు అంతర్జాతీయంగా డాలర్ల పంట కురిపించే ఆక్వా కల్చర్ ప్రధాన పంటలు. అంతర్వేది, వాడపల్లి, అయినవిల్లి, మురమళ్ల, ద్రాక్షారామ, ద్వారపూడి, కోటిపల్లి, అప్పనపల్లి వంటి ప్రసిద్ధినొందిన పుణ్యక్షేత్రాలకు నిలయం. గాడిమొగలోని రిలయన్స్, జీఎస్‌పీఎస్, ఎస్.యానాంలోని కెయిర్న్ ఎనర్జీ, ఓడలరేవులోని ఓఎన్జీసీ చమురు క్షేత్రాలు నియోజకవర్గానికి ఎనలేని ప్రాధాన్యతను పెంచాయి. కుటీర పరిశ్రమలు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఇక్కడి ప్రజల జీవనోపాధిలో కీలకంగా ఉన్నాయి. 216 జాతీయరహదారి, కోటిపల్లి-నరసాపురం మధ్య రైల్వేలైన్ నిర్మాణాలు ప్రగతిపథంలో కొనసాగుతూనే ఉన్నాయి. అన్ని వనరులు పుష్కలంగా ఉండడంతో జిల్లా పునర్విభజనలో భాగంగా అమలాపురం కేంద్రంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ఆవిర్భవించింది. కాగా పార్లమెంటు నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రాధాన్యత కంటే సామాజికవర్గాల సమీకరణలపైనే లోక్‌సభ ఎన్నికల ఓటర్ల నాడి ఆధారపడి ఉంటుంది.



అమలాపురంలో కలెక్టరేట్



ఓటర్ల వివరాలు ఇలా..

అమలాపురం(ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 15,24,500 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 7,55,914 మంది పురుషులు, 7,68,565 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 21 మంది ఉన్నారు. పార్లమెంటు పరిధిలో 1644 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 615 సమస్యాత్మక, 358 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

సమస్యలు ఇవీ..



కోటిపల్లి-ముక్తేశ్వరం రైల్వేలైన్ నిర్మాణ పనులు

నియోజకవర్గంలో ప్రధానమైనది తాగునీటి సమస్య. ఇందుకోసం తీరప్రాంత మండలాల్లో ప్రత్యేకమైన తాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అమలాపురం, మండపేట, రామచంద్రపురం పట్టణాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి ప్రాజెక్టు ఏర్పాటు అనివార్యం. సాగునీటి కాల్వల ఆధునీకీకరణ పనులు అమలు చేయాల్సి వుంది. సఖినేటిపల్లి-నరసాపురం మధ్య వారధి నిర్మించాల్సి ఉంది.

అభివృద్ధి బాటలో..

సుమారు రూ.వెయ్యి కోట్ల పైబడిన వ్యయంతో చిరకాల కల అయిన కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ నిర్మాణం పురోభివృద్ధిలో కొనసాగుతూనే ఉంది. 216 జాతీయ రహదారి అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.



అమలాపురం ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ నియోజకవర్గం ఆది నుంచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. కాకినాడ ద్విసభ్య నియోజకవర్గంలో ప్రజా సోషలిస్ట్, కమ్యూనిస్ట్ పార్టీల పాలకుల ఏలుబడి నుంచి 1962లో తొలిసారిగా ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. అమలాపురం లోక్‌సభ రిజర్వ్‌డ్ స్థానం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 15 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో 9 పర్యాయాలు కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత నాయకులు ఎన్నికయ్యారు. అయిదుసార్లు తెలుగుదేశం పార్టీ నాయకులు విజయకేతనం ఎగురవేశారు. ఒకసారి వైసీపీ గెలుపొందింది. ఈ స్థానం నుంచి ఎన్నికైన వారిలో భయ్యా

మొదట్లో కాంగ్రెస్‌కు కంచుకోట

సూర్యనారాయణమూర్తి అలియాస్ బీఎస్ మూర్తి పుష్కర కాలం పాటు కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన చరిత్ర ఉంది. ఆ తర్వాత జీఎంసీ బాలయోగి రెండు పర్యాయాలు లోక్‌సభ స్పీకర్ హోదాలో ఈ నియోజకవర్గ కీర్తి ప్రతిష్ఠలను దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కీర్తిని గడించారు. ఇక్కడ నుంచి పోటీ చేసి గెలిచిన వారికి మళ్లీమళ్లీ పట్టం కట్టే చరిత్ర నియోజకవర్గ ఓటర్లది. బీఎస్ మూర్తి నాలుగు పర్యాయాలు, కుసుమ కృష్ణమూర్తి, జీఎంసీ బాలయోగిలు మూడేసి పర్యాయాలు ఎంపీలుగా పనిచేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అప్పట్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కేఎస్ఆర్ మూర్తి ఇక్కడ నుంచి ఒక పర్యాయం ఎంపీగా పనిచేశారు. జీవీ హర్షకుమార్ రెండు పర్యాయాలు పనిచేశారు. దివంగత నేత బాలయోగి సతీమణి విజయకుమారి, ఏజేవీబీ మహేశ్వరరావులు ఇక్కడ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. 2009లో జరిగిన పునర్విభజనలో గత లోక్‌సభలో ఉండే అల్లవరం, తాళ్లరేవు అసెంబ్లీ నియోజకవర్గాలు గల్లంతై ఆ స్థానంలో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలతో జిల్లాలోనే అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గంగా ఆవిర్భవించింది.

పార్లమెంట్ నియోజకవర్గ చరితం

అమలాపురం ఎస్‌సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం నుంచి దళిత యోధులు ఎన్నికయ్యారు. ఉప ఎన్నికతో 15 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో తొమ్మిదిసార్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులే విజయకేతనం ఎగురవేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు అయిదు పర్యాయాలు ఆ పార్టీ నేతలు ఎన్నికయ్యారు. 1962 నుంచి 1971 వరకు మూడు సార్లు జరిగిన ఎన్నికల్లో బీఎస్ మూర్తి కాంగ్రెస్ నుంచి ప్రత్యర్థులను ఓడించి వరుస విజయాలతో లోక్‌సభకు ఎన్నికయ్యారు. అంతకుముందే ఆయన రెండుసార్లు కాకినాడ, ఏలూరు నుంచి లోక్‌సభకు ఎన్నికైన చరిత్ర ఉంది. ఆయన స్వస్థలం మండల కేంద్రమైన మామిడికుదురు. పుష్కర కాలంపాటు కేంద్రంలో సామాజిక అభివృద్ధి, సహకారం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసి అప్పట్లో ఓ గొప్ప దళిత నేతగా చరిత్రకెక్కారు. కాగా 1977లో తొలిసారిగా కుసుమ కృష్ణమూర్తి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి బీఎల్‌డీ పార్టీకి చెందిన బీవీ రమణయ్యపై ఘన విజయం సాధించారు. తిరిగి 1980లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కుసుమ కృష్ణమూర్తి రిపబ్లికన్ పార్టీ నాయకురాలు జె.ఈశ్వరీభాయిపై కాంగ్రెస్ నుంచి ఎన్నియ్యారు. 1984లో టీడీపీ ఆవిర్భావ సమయంలో జరిగిన ఎన్నికల్లో పార్టీ నుంచి ఏజేవీబీ మహేశ్వరరావు, కుసుమ కృష్ణమూర్తి(కాంగ్రెస్)పై విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన బుచ్చిమహేశ్వరరావుపై కుసుమ కృష్ణమూర్తి గెలుపొందారు. మూడేళ్లలో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ నుంచి జీఎంసీ బాలయోగి పోటీ చేసి కుసుమ కృష్ణమూర్తిపై విజయం సాధించారు. 1996లో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి కేఎస్‌ఆర్ మూర్తి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి జీఎంసీ బాలయోగిని ఓడించారు. 1998లో జరిగిన ఎన్నికల్లో కేఎస్‌ఆర్ మూర్తిని ఓడించి బాలయోగి విజయకేతనం ఎగురవేశారు. అప్పట్లో దేశంలోనే అత్యున్నతమైన లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత 1999లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో బాలయోగి కాంగ్రెస్ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుపై విజయం సాధించి తిరిగి లోక్‌సభాపతిగా రెండవసారి ఎన్నికయ్యారు. పదవి నిర్వహిస్తుండగానే హెలికాప్టర్ దుర్ఘటనలో 2002 మార్చి 3వ తేదీన బాలయోగి దుర్మరణం చెందారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో బాలయోగి సతీమణి జి.విజయకుమారి అత్యధిక మెజార్టీతో ఎన్నికై 2004 వరకు పదవిలో కొనసాగారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీకి చెందిన దున్నా జనార్ధనరావుపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన జీవీ హర్షకుమార్ విజయం సాధించారు. లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన తర్వాత 2009లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన జీవీ హర్షకుమార్ ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి పి.ప్రమీలాదేవిపై విజయం సాధించి దశాబ్దకాలం పాటు నియోజకవర్గానికి ఎంపీగా కొనసాగారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండే ఈ స్థానం నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో తొమ్మిది పర్యాయాలు ఆ పార్టీ అభ్యర్థులే విజయం సాధించిన చరిత్ర నేపథ్యంలో 2024లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ పరిస్థితి నియోజకవర్గంలో అంతంతమాత్రంగానే ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరపున చింతా అనురాధ టీడీపీ అభ్యర్థి హరీష్‌మాధుర్‌పై విజయం సాధించారు. ఈ సారి జరిగే ఎన్నికల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా ఇప్పటి వరకు 16 మంది బరిలో ఉన్నారు. అయితే ప్రధాన పోటీ మాత్రం కూటమి తరపున టీడీపీ, వైసీపీల మధ్యే నెలకొంది.

ఇంటర్వ్యూ

టీ టైం ఉదయ్‌గా ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నాను



- ఇకపై కూడా ప్రజల్లోనే ఉంటా
- నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- కూటమిని ప్రజలు కోరుకుంటున్నారు
- ఉమ్మడి మేనిఫెస్టో ప్రజల్లోకి దూసుకుపోయింది
- కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

ప్ర: ప్రస్తుత ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

జ: ప్రచారం బ్రహ్మాండంగా సాగుతోంది. కాకినాడ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

ప్ర: ఏ వర్గాల ప్రజలు ఎలా స్పందిస్తున్నారు?

జ: అన్ని వర్గాల ప్రజలు కూటమి అభ్యర్థిగా నన్ను బాగా ఆదరిస్తున్నారు.

ప్ర: మీకున్న గెలుపు అవకాశాలేంటి? ఎందుకంత ధీమా?

జ: టీటైం ఉదయ్‌గా ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నాను. ఇకపై కూడా ప్రజల్లోనే ఉంటాను. ప్రజల ఆకాంక్షల మేరకు టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు ఏర్పాటైంది. ప్రజలు సంక్షేమంతోపాటు అభివృద్ధి కావాలని కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, పవన్‌కల్యాణ్ నాయకత్వంపై ఉన్న భరోసా, చంద్రబాబునాయుడు విజన్ అన్ని కలిసి కూటమి అభ్యర్థిగా గెలుపు అవకాశాలు నాకే ఉన్నాయి.

ప్ర: ఇక్కడ మెజారిటీ వర్గాల కోసం మీరేమి చేయబోతున్నారు?

జ: మెజార్టీ వర్గాల సమస్యలన్నీ తీర్చి వారికి ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాను.

ప్ర: గత పాలకుల హయాంలో జరిగిన అన్యాయమేంటి?

జ: అడుగడుగునా ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను మోసం చేశారు. బటన్ నొక్కడం తప్ప డబ్బులు పడ్డ దాఖలాలు లేవు. ఉద్యోగులను నిరుద్యోగులను, కార్మికులను, రైతులను, చేనేత కార్మికులను, మత్స్యకారులను ఇలా అన్నివర్గాల ప్రజలకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసింది. రాజధాని మొదలుకుని పోలవరం వరకు ఏఒక్క పని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేక పోయింది.

ప్ర: ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏం చేయబోతున్నారు?

జ: ఎంపీగా గెలిచిన తర్వాత స్థానికంగా కాకినాడలోని నివాసం ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటాను. కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి చేసేందుకు నావంతు కృషిచేస్తాను.

ప్ర: గెలిచాక ఏ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తారు?

జ: ఏలేరు సుద్దగడ్డ ఆధునీకీకరణ, పిఠాపురం పరిధిలోని చేనేత కార్మికుల సమస్య పరిష్కారం, పిఠాపురం, కాకినాడ మత్స్యకార గ్రామాల్లో సమస్యలతోపాటు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతి గ్రామంలో సీఎస్ఆర్ ఫండ్స్ లేదా ఎంపీ నిధుల నుంచి ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేస్తాను. కాకినాడలో ఎప్పటినుంచి పెండింగ్‌లో ఉన్న ట్రిబుల్ ఐటీ, మెట్రో కాంప్లెక్స్‌కు కృషి చేస్తాను. టూరిజం డెవలప్‌మెంట్ చేస్తాను.

ప్ర: కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?

జ: జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థులంతా బాగా సహకరిస్తున్నారు. కూటమి విజయానికి అందరూ కృషి చేస్తున్నారు.

ప్ర: ప్రచారంలో మీ కుటుంబసభ్యుల సహకారం ఎలా ఉంది?

జ: మా కుటుంబ సభ్యులంతా ఎవరికి వారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. అన్ని రకాలుగా నాకు సహకరిస్తున్నారు.

ప్ర: మీ పార్టీ ఎన్నికల హామీలపై జన స్పందన ఏంటి?

జ: కూటమి మేనిఫెస్టో ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లిపోయింది. వైసీపీ మేనిఫెస్టో వచ్చినట్లు కూడా ఎవరికీ తెలియదు. మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని తప్పకుండా అమలు చేయడానికి పవన్‌కల్యాణ్, చంద్రబాబు కృషిచేస్తారు.

మోదీ వస్తున్నారు..

6న వేమగిరి హైవే వద్ద భారీ బహిరంగ సభ

కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాని రాక ● ట్రాఫిక్ మళ్లింపు

భారీ వేదిక నిర్మాణం



రాజమహేంద్రవరం, మే 3(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 6న రాజమహేంద్రవరం రానున్నారు. ఆయనతోపాటు టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , జనసేన అధినేత, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ కూడా హాజరవుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం ఎంపీ బరిలో ఉన్నారు. నర్సాపురం లోక్‌సభలో కూడా కూటమి తరపున బీజేపీ అభ్యర్థి వర్మ పోటీ చేస్తున్నారు. అనపర్తిలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. వీరితో పాటు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రజలకు పిలుపు ఇచ్చేందుకు ప్రధాన మోదీ వస్తున్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలో ఈ సభ విజయ శంఖారావం పేరిట ఇక్కడ జరగనుంది. గత మే నెలలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించిన వేమగిరిలో జాతీయ రహదారి పక్కన భారీ బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి జిల్లాల నుంచి సుమారు 2 లక్షల మంది హాజరవుతున్నట్టు నేతలు చెబుతున్నారు.

కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ..

రాజమహేంద్రవరం అర్బన్, మే 3: ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఈనెల 6వ తేదీన రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ జరుగుతుందని ప్రోగ్రాం ఇన్‌చార్జి కోడూరు లక్ష్మీనారాయణ, కో ఆర్డినేటర్ కాశీ విశ్వనాథరాజు వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విజయ శంఖారావం పేరుతో ఆ రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలంలో జరిగే బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తారని తెలిపారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు చర్యలు

రాజమహేంద్రవరం, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఈ నెల 6న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో బహిరంగ సభకు హాజరవుతున్న సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. 6న ఉదయం 6 గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఎస్పీ జగదీశ్ తెలిపారు. గుండుగొలను, తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు నల్లజర్ల-దేవరపల్లి-గామన్ బ్రిడ్జి-దివాన్‌చెరువు మీదుగా విశాఖ వెళ్లాలన్నారు. జొన్నాడ నుంచి మండపేట, రామచంద్రాపురం, కాకినాడ మీదుగా వాహనాలు కత్తిపూడిలో జాతీయ రహదారికి చేరుకోవాలని తెలిపారు. అలాగే కత్తిపూడి నుంచి వచ్చే వాహనాలు పిఠాపురం, కాకినాడ, రామచంద్రాపురం గుండా జొన్నాడ చేరుకొని విజయవాడ వైపు వెళ్లాలన్నారు. జిల్లా పరిసర ప్రాంతాల నుంచి వేమగిరి మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు ధవళేశ్వరం, ఐఎల్‌టీడీ జంక్షను, కోటిపల్లి బస్టాండ్.. కేశవరం, ద్వారపూడి, మండపేట, రామచంద్రాపురం మీదుగా కాకినాడ.. పెరవలి జంక్షన్, సమిశ్రగూడెం, విజ్జేశ్వరం, కొవ్వూరు, గామన్ బ్రిడ్జి.. రాజానగరం, ద్వారపూడి, మండపేట, ఆలమూరు, జొన్నాడ, రావులపాలెం.. దివాన్ చెరువు, గామన్‌బ్రిడ్జి, కొవ్వూరు, విజ్జేశ్వరం, పెరవలి, రావులపాలెం గుండా ప్రయాణించాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపును అనుసరించి వాహనాలు ప్రయాణించాలని, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

'బీజేపీది డబుల్ ఇంజన్ విధానం'

కాకినాడ సిటీ, మే 3: ముస్లింల రిజర్వేషన్లపై తెలంగాణలో ఒక విధంగా, ఆంధ్ర రాష్ట్రంలో మరో విధంగా బీజేపీ డబుల్ ఇంజన్ విధానం అవలంబిస్తోందని పీసీసీ మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు విమర్శించారు. బీజేపీ హయాంలో రాజ్యాంగ వ్యవస్థలకు తూట్లు పొడిచారని, రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఇండియా అలయెన్స్ పార్టీ నేతలు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ దేశంలో ప్రతిపక్షాలపై కక్ష సాధించే రీతిలో కేంద్రంలోని బీజేపీ పాలన సాగిస్తోందన్నారు. రైతులకు, మహిళలకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. రైతులకు సంబంధించి మూడు నల్ల చట్టాలు తెస్తే దాన్ని ప్రశ్నించినందుకు రాహుల్‌గాంధీని సస్పెండ్ చేశారన్నారు. కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు మాట్లాడుతూ దేశ రక్షణకు ఇండియా కూటమిలోని పార్టీలు పనిచేస్తున్నాయన్నారు. ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్య క్షుడు దాట్ల గాంధీరాజు, సీపీఎం నాయకులు దువ్వా శేషబాబ్జి, ఎం.రాజ శేఖర్, సీపీఐ నాయకులు కె.బోడ కొండ, ఆప్ నాయకులు వరదరాజులు, నరాల శివ, కృష్ణమోహన్, కాకినాడ సిటీ, రూరల్ అభ్యర్థులు చెక్క నూక రాజు, పిల్లి సత్య లక్ష్మి, నాయకులు పైడా రామ్‌కుమార్, మట్టా శివప్రసాద్ ఉన్నారు.

10న డెల్టా కాలువల మూసివేత

ధవళేశ్వరం, మే3: రబీకి నీటి విడుదల అనంతరం కాల్వల పరిధిలో మరమ్మత్తులు చేపట్టడానికి వీలుగా డెల్టా కాలువలను ఈ నెల 10 సాయంత్రం మూసివేయనున్నట్లు గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చెరువులు ఈ లోపు నింపుకోవాలని ఆయన సూచించారు. సుమారు 50 రోజుల క్లోజర్ పిరియడ్‌లో కాల్వల పరిధిలో లాకులు, షెట్టర్ల మరమ్మత్తులతో పాటు పూడిక తీత పనులు చేపట్టనున్నారు. శుక్రవారం సాయంత్రం తూర్పు డెల్టాకు 100 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3350 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

జనసేన నేత నాగబాబు రోడ్‌షో



రోడ్‌షోలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం రూరల్, మే 3: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సహా తమందరి జీవితాలకు ఏదో సాధించాలని ఉందని, సంపాదించాలనే కోరికలు లేవని, కేవలం సేవ చేయాలనే తపన ఉందని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. పిఠాపురం మండలం బి.కొత్తూరు, జగపతిరాజపురం, పి.తిమ్మాపురం, వి.రాయవరం, రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు గ్రామాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మతో కలిసి శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ రోడ్‌షో నిర్వహించారు. అడుగడుగునా పూలవర్షం కురిపించారు. కేంద్రం, రాష్ట్రంలో ఏర్పడే కూటమి ప్రభుత్వాలు సహకారంతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత పవన్ తీసుకుంటారని చెప్పారు. రాజశేఖర్‌రెడ్డి ముఖం చూసి గత ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేశారని, ఈసారి మీ పిల్లలను చూసి జనసేన కూటమికి ఓటు వేయాలని కోరారు. పవన్ సినిమాలు ద్వారా వచ్చిన సంపాదనను ప్రజలకే ఖర్చు చేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుట్రలకు పాల్పడినా పవన్ రికార్డు స్థాయి మెజార్టీతో పిఠాపురంలో విజయం సాధిస్తారని తెలిపారు. ఏ నాడు ప్రజలకు కనిపించని వంగా గీతను అత్తారింటికి పంపుదామని వ్యాఖ్యానించారు. ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లను జనసేనకు వేయాలని విజ్ఞప్తి చేశారు. రోడ్‌షోలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, నకుమళ్ల గంగాధర్, బర్ల అప్పారావు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి బ్యాంకు ద్వారా

రూ.12,500 కోట్ల రుణాలు



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, మే 3: రాష్ట్రంలోని 8 జిల్లాల్లోని 268 శాఖల ద్వారా సేవలందిస్తున్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 2024 మార్చి నెలాఖరు నాటికి రూ. 10,028 కోట్లు డిపాజిట్లు సేకరించి రూ.12,500 కోట్లు రుణాలుగా అందించినట్లు బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గొల్లప్రోలులోని బ్యాంకు శాఖ నూతన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో తమ బ్యాంకు పనిచేస్తున్నదని తెలిపారు. సీనియర్స్ సిటిజన్స్‌కు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో తమ బ్యాంకు అధికంగా 8.60శాతం వడ్డీ చెల్లిస్తున్నదని చెప్పారు. రైతులు పంట పొలాలు కొనుగోలు చేసేందుకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. బీమా సౌకర్యంతో పాటు ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులో ఉందని చెప్పారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో 65 శాఖలు ఉన్నాయని, మరో ఐదు శాఖలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు రీజియన్ మేనేజరు డి.పాపయ్య, ప్రధాన కార్యాలయ ప్రణాళిక అధికారి ఆంజనేయులు, రామారెడ్డి, ప్రాంతీయ కార్యాలయ క్రెడిట్ అధికారి రత్నకుమార్, బ్రాంచి మేనేజరు జె.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

నూతన ఆలోచనలకు వేదికగా మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లు

జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, మే 3: నూతన ఆలోచనలకు మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లు వేదికగా నిలుస్తాయని జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు అన్నారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్) విభాగం ఆధ్వర్యంలో ఎక్లోర్-2కే24 మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ఫెస్ట్‌ను ప్రారంభించగా విశిష్టఅతిథిగా ఎస్‌బీఐ ఆర్ఎం తపోదస్ దెహ్రీ, గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత పాల్గొనగా ఎస్ఎంఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ.కృష్ణమోహన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విభాగంలో హాస్పిటాలిటీ కోర్సు ప్రారంభిస్తామని, దీనికి సంబంధించిన పాఠ్యప్రణాళికలను త్వరలో రూపొందించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు. పలువురు డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ కోఆర్డినేటర్లు, వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులున్నారు.

పాలకులు ఉచితాలు ఇవ్వొద్దు.. ప్రజల్ని సోమరిపోతుల్ని చెయ్యవద్దు

సామాజికవేత్త ఖండవిల్లి వీరభద్రం

కాకినాడ సిటీ, మే 3: పాలకులు ఉచితాలు ఇవ్వొద్దని.. ప్రజల్ని సోమరిపోతుల్ని చెయ్యవద్దని.. అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందని రిటైర్డ్ వ్యాయామ అధ్యాపకుడు, సామాజికవేత్త ఖండవిల్లి వీరభద్రం అన్నారు. కాకినాడ ప్రతాప్‌నగర్‌లోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వచన పద్య కవిత రత్నములు, పద్య రత్నములు అనే రెండు పుస్తకాలు రాసి ప్రచురించామన్నారు. ప్రస్తుత సమకాలిక రాజకీయ పోకడలు దృష్టిలో ఉంచుకుని ఉచితాలు లేని భారతావని కోసం తాను వ్యాసం రాశానని, పుస్తక రూపంలో త్వరలో ముద్రితం కానుందన్నారు. పాలకులు ఉచి తాలు ఆపి ఇండియాను పేదరిక దేశంగా కాకుండా పెద్దరిక దేశంగా చేయాలన్నారు. హోప్ ఐలాండ్‌ను కాకినాడ రత్న ద్వీ పంగా అభివృద్ధి చేస్తే పర్యాటక అభివృద్ధి జరుగుతుందన్నారు. రిటైరైన తర్వాత 24ఏళ్లుగా సామాజిక సేవా కార్యకమాలు చేస్తున్నానన్నారు. నాయకులు ప్రకాష్‌గౌడ్, అప్పారావు పాల్గొన్నారు.

సుభాష్, హరీష్‌ల గెలుపు తథ్యం

మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు

కాజులూరు, మే 3: టీడీపీ కూటమి రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌ల విజయం తథ్యమని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. కాజులూరు మండలం కోలంక గ్రామంలో శుక్రవారం సుభాష్, హరీష్ మాధుర్‌లకు మద్దతుగా చిక్కాల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యువకులు, విద్యావంతులు అయిన సుభాష్, హరీష్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. టీడీపీ, కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సుభాష్ పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 50 ఏళ్ళు వెనక్కి పడిందని వృత్తి, వ్యాపారులతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులు సైతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మంచి విజనరీ ఉన్న నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మోదీల ఐక్యతతో రాష్ట్రంలో ఎన్నో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ధీమా వ్యక్తం చేశారు. దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఆశయ సాధనకు కృషి చేస్తానని ఆయన తనయుడు గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. దళితులంతా కూటమి వైపు ఉన్నారని, భారీ విజయంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పేపకాయల బాబ్జి, జనసేన మండలాధ్యక్షుడు బొండా వెంకన్న, డేగల సతీష్, గంధం పళ్ళంరాజు, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, గుబ్బల ఏసురాజు, వనుం వీరభద్రం, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



కోలంకలో సుభాష్, హరీష్‌లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చిక్కాల

జగన్‌కు ఓటేస్తే అంతా నాశనమే

పెద్దాపురం కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప

పలుచోట్ల విస్తృత ప్రచారం







సామర్లకోట: పెద్దబ్రహ్మదేవంలో ప్రచారం వాహనంపై రాజప్ప, చంద్రమౌళి.. టీడీపీ ప్రచారం దృశ్యం, పనసపాడులో ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహిస్తున్న రంగనాగ్

సామర్లకోట, మే 3: ఏపీలో మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే అంతా నాశనంతప్ప ఏమీ ఉండదని పెద్దాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలో కూటమి పార్టీల నాయకులతో కలిసి శుక్రవారం రాత్రి విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చినరాజప్పతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి, బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ ప్రత్యేక వాహనంపై ప్రజలకు అభివాదం చేసుకుంటూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ జగన్ అమరావతి రాజధానిని విశాఖకు మార్చుతాడని, మన భూములపైనే మనకు హక్కులు కోల్పోయే చట్టం తెచ్చాడని అలాంటి వాడిని ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కూటమి మేనిఫెస్టో పత్రాలను మహిళలకు అందజేసిన గుణ్ణం చంద్రమౌళి మాట్లాడుతూ తెలుగుదేశం పాలనే ఈ రాష్ట్రానికి చారిత్రక అవసరమన్నారు. సామర్లకోట మండలం హుస్సేన్‌పురం, పనసపాడులో టీడీపీ నాయకులు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్, కూటమి పార్టీల నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ప్రచారం చల్లా బుజ్జి, చీకట్ల వెంకటేష్‌ల నాయకత్వంలో నిర్వహించగా చినరాజప్ప తనయుడు రంగనాగ్, కూటమి నాయకులు,కార్యకర్తలు అధికంగా పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం

వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టం భూరక్షణ చట్టం కాదని, భూభక్షణ చట్టమని పెద్దాపురం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. శుక్రవారం సామర్లకోటలో విలేకరులతో రాజప్ప మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించి చంద్రబాబు సీఎంగా రెండో సంతకం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపైనేనని చెప్పారు.

రాజప్ప, ఉదయ్ ప్రచారం

పెద్దాపురం, మే 3: వైసీపీని నమ్మి ప్రజలు మళ్లీ మోసపోవద్దని, త్వరలో జరిగే ఎన్నికల్లో విజయం సాధించేది కూటమే అని ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని కాండ్రకోట, పెద్దాపురం పట్టణంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో ఆయన కాకినాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పాల్గొన్నారు. ప్రతీ ఇంటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆయనకు హారతులు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమితో రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎప్పుడూ తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తెలిపారు. టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, నిమ్మకాయల రంగనాగ్, ,ఎలిశెట్టి నాని, కర్రి వెంకటరమణ పాల్గొన్నారు.



పెద్దాపురం: కాండ్రకోటలో రాజప్పకు పూలతో స్వాగతం



ప్రచారంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్

దోపిడీదారుల నుంచి కాకినాడను కాపాడుకోవాలి

కూటమికి దళిత, కార్మిక, కాపు, మత్స్యకార సంఘాల మద్దతు

కాకినాడ సిటీ, మే 3: కాకినాడను దోపిడీదారులనుంచి కాపాడుకోవాలని, అందుకు టీడీపీ-జనసేన-బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని దళిత, కార్మిక, కాపు, మత్స్యకార సంఘాల నాయకులు తమ మద్దతు ప్రకటించారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జనసేన పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు శుక్రవారం వేర్వేరుగా మీడియా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి బొలిశెట్టి సత్య మాట్లాడారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వైసీపీ నేతలు మెగాస్టార్ చిరంజీవి, జనసేనాని పవన్‌కల్యాణ్ కుటుంబసభ్యులపై కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్నారు. వీటిని తాము, పవన్‌కల్యాణ్ మరచిపోలేదని, ద్వారంపూడిని ఓడించి జైలుకు పంపుతామన్నారు. సిటీ అభ్యర్థి ద్వారంపూడితోపాటు రూరల్ అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అక్రమాలను ఒక్కొక్కటీ బయటకు తీసి త్వరలో ప్రజలకు వివరిస్తామన్నారు. పవన్ ఆశయాన్ని అందరూ గెలిపించాలని కోరారు. జనసేన పార్లమెంటరీ ప్రచార కమిటీ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు మాట్లాడుతూ కాకినాడ పోర్టులో ఎన్నో అక్రమాలు చేస్తున్నారని, టన్నుకు రూ.2 చొప్పున వసూలు చేస్తున్న కోట్ల రూపాయల అక్రమ సొమ్ము ద్వారంపూడి ఖాతాలోకి వెళ్లిపోతోందన్నారు. జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుగ్గన బాబ్జి మాట్లాడుతూ ద్వారంపూడి తీరు వల్ల ట్రాన్స్‌పోర్ట్ రంగానికి తీవ్రనష్టం కలిగి లారీఓనర్లు వాటిని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాకినాడ సిటీకి వనమాడి కొండబాబు, పార్లమెంట్‌కు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను గెలిపించుకోవాలని కోరారు. జనసేన మత్స్యకార విభాగం జిల్లా అధ్యక్షుడు మల్లాడి రాజు మాట్లాడుతూ మత్స్యకారులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ద్వారంపూడిని ఓడించేందుకు మత్స్యకారులంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు మాట్లాడుతూ ఎన్నో దళిత సంక్షేమ పథకాలు రద్దు చేసి దళితులకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో జనసేన నాయకుడు దాసరి కిరణ్, బీజేపీ నాయకుడు కొక్కిలిగడ్డ గంగరాజు, రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు బి.రంగారావు, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోటి చలంగల్‌రావు, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్, జనసేన నాయకులడు పెసింగి ఆదినారాయణ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన బీజేపీ కూటమిని గెలిపిద్దామని ఎమ్మార్పీఎస్ ముద్రించిన పోస్టర్‌ను బొలిశెట్టి సత్య ఆవిష్కరించారు.

జిల్లా రిజిస్ట్రేషన్ కమిటీ సభ్యుల ఎన్నిక

జీజీహెచ్(కాకినాడ), మే 3: జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ కమిటీ(డీఆర్‌పి) సభ్యుల ఎన్నిక కోసం డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని డీఆర్‌పి కమిటీ సభ్యులను ఎన్నిక చేశారు. అన్ని ప్రైవేట్ ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ ఉండాలని, లేకపోతే ఏపీపీఎంసీడీ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఆస్పత్రికి విధిగా ఫైర్, బయో మెడికల్ వేస్ట్ మేనేజిమెంట్, ఏపీ పొల్యూషన్ అనుమతులు ఉండాలన్నారు. సమావేశంలో సెక్రటరీ డాక్టర్ సి.కిరణ్‌కుమార్, ఏపీఎన్‌ఏ ప్రెసిడెంట్ డాక్టర్ కౌషిక్ నాయుడు, డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత ఉన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, మే 3: మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దేవస్థానం వేదపండితుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించామని దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల



జగన్నాధపురంలో మాట్లాడుతున్న యనమల

కోటనందూరు, ఏప్రిల్ 3: రానున్నది కూటమి ప్రభుత్వమే నని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని జగన్నాధపురంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ జగన్ జైలు కెళ్లడం ఖాయమని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేసే బాధ్యత తమదేనన్నారు. అందుకు సంబంధించి వనరులు సృష్టించి అమలు చేస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుతో పాటు 50 ఏళ్లకే బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీలకు పింఛన్లు అందిస్తామన్నారు. ప్రజలందరు ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, తుని నియోజకర్గ ఎలక్షన్ ఆర్డినేటర్ సుర్ల లోవ రాజు, మోతుకూరి వెంకటేష్, డి.చిరంజీవిరాజు, యర్రచినసత్యనారాయణ, మాతిరెడ్డి బాబులు, అంకంరెడ్డి రమేష్, షేక్ నవాబ్‌జానీ, పోతల సూరిబాబు, అంకంరెడ్డి బుల్లిబాబు, చిటికెల సత్యనారాయణ, గుడివాడ నాని, బైలపూడి శ్రీరామమూర్తి,పెనుముచ్చు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు ఓటుతో అడ్డుకట్ట'

తొండంగి, మే 3: రాష్ట్రంలో ఉన్న అరాచక పాలనకు ఓటుతో అడ్డుకట్ట వేయాలని తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎల్లయ్యపేట యర్రయ్యపేట గ్రామాల్లో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని వాటి నుంచి రక్షణ కలగాలంటే తప్పనిసరిగా తమ ఓటును కూటమి అభ్యర్థులకు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సుంకర పావని, యనమల నాగేశ్వరావు, యనమల రాజేష్, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, సాధనాల నూకరాజు, అరిగెల నర్సింహమూర్తి, చొక్కా కాశీ తదితరులున్నారు.

'పవన్ గెలుపు ప్రతిఫలం ప్రజలకే'

గొల్లప్రోలు, మే 3: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఆ ప్రతిఫలం అభివృద్ధి, సంక్షేమం, సేవ రూపంలో ప్రజలకే దక్కుతుందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. గొల్లప్రోలు పట్టణ జనసేన నాయకులు బలిరెడ్డి నాని, గారపాటి గణేష్, గొంతిరెడ్డి గంగ ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం నాగబాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారిని నాగబాబు పార్టీలోకి ఆహ్వానిస్తూ ప్రతి ఒక్కరు పవన్‌కల్యాణ్, ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్ విజయానికి కృషి చేయాలని కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



తాళ్లరేవు, మే 3: సుంకరపాలెం పితానివారిపేటకు చెందిన వైసీపీ కార్యకర్తలు 30మంది శెట్టిబలిజ కుటుంబాలు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోపూరి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీలో చేరారు. ఉమ్మడి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. టీడీపీ నేతలు వినాయకరావు, సూరిబాబు, రామచంద్రరావు ఉన్నారు.

టీడీపీ నేత రేళ్ల శ్రీనివాస చక్రవర్తి తాళ్లరేవులో ఇంటింటా తిరిగి బ్యాలెట్ నమూనాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కుడిపూడి దుర్గాప్రసాద్, కంద్రేగుల శ్రీనివాస్, కుడిపూడి రామకృష్ణ, భజన చంటిబాబు ఉన్నారు.

సబ్ జైలు సమయ వేళల్లో మార్పులు

పెద్దాపురం, మే 3: స్థానిక సబ్ జైలులో ఉన్న నిందితులను వారి బంధువులు కలుసుకునే సమయాల్లో మార్పు చేసినట్టు జైల్ పర్యవేక్షణాధికారి వై.శ్రవణ్‌కుమార్ తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ, అలాగే సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ నిందితులను కలుసుకునేందుకు బంధువులకు అవకాశం ఇవ్వనున్నట్లు. ఈ వేళలు జూన్ 15వరకూ అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

గోనేడలో తోట సునీత ప్రచారం

కిర్లంపూడి, మే 3: మండలంలోని గోనేడ గ్రామంలో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత సర్వారాయుడు ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించారు. గోనేడ సర్పంచ్ అల్లు విజయ్‌కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు నీలం శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో సునీత ఇంటింటికి సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూను, గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

జనసేన, టీడీపీ నాయకుల ప్రచారం

రౌతులపూడి, మే 3: మండలంలోని బిబిపట్నం, ఎ.మల్లవరం గ్రామాల్లో జనసేన, టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకినా ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభను నెగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కరణం సుబ్రహ్మణ్యం, నిర్మానాగు, సతీష్, పైల రామకృష్ణ, నల్లమల్లిరవి, గురునాధ్, పల్లికుమార్, సలీమ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమి విజయం ఖాయం

జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ





జగ్గంపేట: ప్రచారంలో నెహ్రూకు హారతి ఇస్తున్న మహిళ, బ్యాలెట్ నమూనా పత్రానికి పూజలు చేస్తున్న నెహ్రూ





గండేపల్లి: టీడీపీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న నెహ్రూ, మల్లేపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నవీన్

గండేపల్లి, మే 3: రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అత్యంత మెజార్టీతో గెలుస్తుందని జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మల్లేపల్లిలో శుక్రవారం గ్రామ ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను పదిమంది వార్డు సభ్యులతో సుమారు 150 కుటుంబాలు వైసీపీని వీడి నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. నెహ్రూ మాట్లాడుతూ కొత్త, పాత కలయికలతో అందరూ కలిసికట్టుగా పనిచేసి ఎన్నికల్లో కూటమిని అత్యంత మెజార్టీతో గెలిపించి చంద్రబాబును సీఎం చేయడంతో పాటు తనను ఎమ్మెల్యేగా అసెంబ్లీ పంపాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, యువనాయకులు జాస్తి వసంత్, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, తెలగరెడ్డి భద్రరావు, వల్లభశెట్టి కోటేశ్వరరావు, టి.ప్రకాష్, పోతుల దుర్గాప్రసాద్, దాపర్తి సీతారామయ్య, అడబాల ఆంజనేయులు, తణుకు దుర్గారావు, తమటం వీరభద్రరావు పాల్గొన్నారు. ఎన్నికల్లో తన తండ్రి అయిన జ్యోతుల నెహ్రూను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ మల్లేపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బ్యాలెట్ నమూనా పత్రానికి పూజలు

జగ్గంపేట, మే 3: మొదటి బ్యాలెట్ నమూనా పత్రానికి జగ్గంపేట మండలం మర్రిపాకలో వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి ముందు ఉంచి జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం చేశారు మర్రిపాకలో జ్యోతుల నెహ్రూ చైతన్య రథంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో చెరువు వద్ద 400మంది ఉపాధి కూలీలు, ఉపాధి పనులు చేస్తుండగా అక్కడకు వెళ్లి ఉపాధి కూలీలను ఆప్యాయంగా వారి సమస్యలను తెలుసుకుని తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, బండారు చిన్నబాబు, గద్దె మారుతి, పైలా శివరామకృష్ణ, కాపవరపు నూకాపతి, కాపవరపు ప్రకాశం, రెడ్డి ఆంజనేయులు, కాపవరపు సత్యనారాయణ, కాపవరపు నాగేశ్వరరావు, కాపవరపు శ్రీను, కలికట్ల బాబురావు పాల్గొన్నారు. జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూ చైతన్య రథంపై ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా జన నీరాజనాలతో మహిళలు మంగళహారతులు ఇచ్చారు. సైకిల్ గుర్తుపైన తనను, గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి ఎంపీ అభ్యర్థి తంగెళ్లను గెలిపించాలని ఆయన కోరారు. రామవరంలో గ్రామ వైసీపీ యువనేత మండపాక బ్రహ్మాజీ రాష్ట్రతెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు స్వగృహంలో జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు.

'నేడు చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి'

సర్పవరం జంక్షన్, మే 3: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కాకినాడ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కాకినాడ పర్యట విజయవంతం చేయాలని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లిసత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ తూరంగిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చంద్రబాబు శనివారం సాయంత్రం 5 గంటలకు చేరుకుంటారన్నారు. అక్కడ చంద్రబాబుకు టీడీపీ,జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలుకుతారన్నారు. అక్కడ నుంచి చంద్రబాబు కాన్వాయ్‌తో పాటూ భారీ బైక్‌తో అన్నమ్మఘాటీ సెంటర్ వద్ద నుంచి కాకినాడ సిటీలోకి వెళ్తారని తెలిపారు. కాకినాడ సంతమార్కెట్ వద్ద జరిగే ఎన్నికల సభలో చంద్రబాబు ప్రసంగిస్తారన్నారు. ఈ సభ విజయవంతానికి కూటమి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని వారు కోరారు.

నేడు కూటమి నాయకుల సమావేశం

జగ్గంపేట, మే 3: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం శనివారం ఉదయం 9గంటలకు జగ్గంపేట పరిణయ ఫంక్షన్ హాల్లో జరగనుంది. దీనికి కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. విశిష్ట అతిథులుగా మూడు పార్టీల జిల్లా అధ్యక్షులు తుమ్మలబాబు, జ్యోతుల నవీన్‌కుమార్, చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొంటారు. నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, జనసైనికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పలువురు టీడీపీ నేతలు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పిఠాపురం, మే 3: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ప్రభాకర్ తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా సబ్‌స్టేషన్ పరిధిలో గల పిఠాపురంలో ఉదయం 7 నుంచి 11గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల ఉండదని,వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నికల్లో కూటమి గెలుపే ధ్యేయం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ



కొత్తపల్లి: నాగులాపల్లిలో ప్రసంగిస్తున్న వర్మ

నాగులాపల్లి (కొత్తపల్లి), మే 3: ఈనెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి గెలుపే ధ్యేయంగా పిఠాపురం అభ్యర్థి పవన్‌కల్యాణ్‌ను భారీ మెజార్టీతో నెగ్గించుకుందామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. నాగులాపల్లిలో శుక్రవారం సాయత్రం రెడ్డి కులస్తుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రారంభించిన ఏలేరు ఫేజ్2 అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి రైతాంగం నోట్లో మట్టి కొట్టిందన్నారు. రాష్ట్రంలో వచ్చేది కూటమి ప్రభుత్వమే అని, రైతుల సమస్యలు తక్షణం పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. పవన్ ఎన్నికల గుర్తు గాజుగ్లాసుకు ఓట్లేసి అత్యధిక మెజార్టీతో విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. సమావేశంలో టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి, జనసేన నాయకులు జవహర్‌రెడ్డి ఉన్నారు.

'పద్మనాభరెడ్డిగా మార్చుకుంటేనే మంచిది'

పిఠాపురం, మే 3: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటేనే మంచిదని, అందుకు సిద్ధంగా ఉండాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పవన్‌పై ముద్రగడ చేసిన వాఖ్యల పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన కూతురే ఆయనను నమ్మడం లేదు. ఇంట్లో వారి ఓట్లు వేయించలేని ముద్రగడ ఇక పిఠాపురం ప్రజలతో ఓట్లు వేయించి పవన్‌ను ఎలా ఓడిస్తారో చెప్పాలని ఎద్దేవా చేశారు. ఇక్కడకు మిధున్ రెడ్డి, మండలానికి ఒక మంత్రిని పెట్టుకున్నా సరే ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా నెగ్గేది పవన్ మాత్రమేనని స్పష్టం చేశారు.

'పవన్‌కు విజయం చేకూర్చాలి'

కొత్తపల్లి, మే 3: ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం కూటమి అభ్యర్థి పవన్‌కల్యాణ్ ఎన్నికల గుర్తు గాజు గ్లాసు గుర్తుకు ఓట్లేసి భారీ మెజార్టీతో విజయం చేకూర్చాలని కూటమి నేతలు ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం కొండెవరం, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి గ్రామాల్లో వాసంశెట్టి శ్రీనివాస్, వేమగిరి రాంబాబు,సత్తిపండు, మారిశెట్టి బుజ్జి, మామిడి మల్లిబాబు, సానా నాగు ఇంటింటా ప్రచారం చేశారు. పిఠాపురం కీర్తిను దేశ చరిత్ర పుటల్లోకి తీసుకెళ్లే పవన్‌ను ఓట్లేసి అత్యధిక మెజార్టీతో నెగ్గించాలని పలువురు ఎస్ ఆర్‌ఐలు మత్స్యకారులను అభ్యర్థించారు. ఉప్పాడ తీరప్రాంత గ్రామాల్లో వారు పవన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

జనసేన కార్యకర్తల ప్రచారం

తుని రూరల్, మే 3: కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దేవు మధువీరేష్ అన్నారు. తుని, తొండంగి, కోటనందూరు గ్రామాల్లో జనసేన కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టారు. గుడ్‌మార్నింగ్ జనసేన అంటూ ప్రజల ముందుకు వెళ్లి పార్టీ మేనిఫెస్టోలు వివరించి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బోనం చినబాబు, అల్లు నాగేశ్వరరావు, లోవరాజు తదితరులు ఉన్నారు.

పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలి : కలెక్టర్



పిఠాపురంలో పోలింగ్ సిబ్బంది శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్, జేసీ రామసుందరరెడ్డి

పిఠాపురం, మే 3: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ పక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటరు ఎవ్వరు సెల్‌ఫోన్లు తీసుకురాకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న పిఠాపురం నియోజకవర్గ రెండో దశ పోలింగ్ సిబ్బంది శిక్షణా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టరు ఎస్.రామసుందర రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం పిఠాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్, మీడియా సెంటర్లను పరిశీలించారు. కలెక్టరు మాట్లాడుతూ పోలింగ్ విధులకు ఎంపికయిన పీవోలు, ఏపీవోలు, ఇతర సిబ్బంది ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో తొలిసారిగా హోమ్ ఓటింగ్ ద్వారా 621 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. ఈనెల 4,5,6న పోలింగ్ సిబ్బందికి పోస్టల్‌బ్యాలెట్ వినియోగించుకునేలా ఆయా నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 7,8నల్లో జిల్లాలో పనిచేస్తూ వేరే జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు జిల్లాస్థాయిలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. పిఠాపురం తహశీల్దారు లక్ష్మీ తదితరులు ఉన్నారు.

'పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ని సద్వినియోగం చేసుకోవాలి'

సర్పవరం జంక్షన్, మే 3: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సౌలభ్యం కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్ కోరారు. శుక్రవారం ఆర్వో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు కాకినాడ రూరల్ ఏపీఎస్పీ హైస్కూల్, కాకినాడ పీఆర్ డిగ్రీ కాలేజీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 3,553 మంది ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయన్నారు. వీరందరికీ బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేశామన్నారు. ఈనెల 4న ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోలింగ్ ఆఫీసర్లు, సహాయ పోలింగ్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్లు ఓటును వినియోగించుకోవాలన్నారు. అలాగే 5,6న ఇతర పోలింగ్ సిబ్బంది, పోలీసులు, అత్యవసర సర్వీసుల సిబ్బంది, డ్రైవర్స్, వీడియో గ్రాఫర్లు ఓటు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. కాకినాడ జిల్లాకు చెందిన ఉద్యోగులు కోనసీమ, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బందికి ఈనెల 7,8న ఓటు వేసేందుకు వీలుగా కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సహాయ ఎన్నికల అధికారి బి.విజయప్రసాద్ పాల్గొన్నారు.

'వైసీపీకి బుద్ధి చెబుతాం'

సర్పవరం జంక్షన్, మే 3: ఎస్సీల ఓట్లతో 151 సీట్లతో గద్దెనెక్కిన సీఎం జగన్ పాలన అంతా దళితులపై దాడులు, దురాగతాలకు పాల్పడటంతోనే సాగిందని, ఎన్నికల్లో ఎస్సీలంతా సంఘటితంగా వైసీపీకి తగిన బుద్ధి చెబుతామని కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, జనసేన కాకినాడ పార్లమెంట్ ఎన్నికల కమిటీ సభ్యుడు టీవీ రామారావు అన్నారు. శుక్రవారం కాకినాడ సిద్ధార్థనగర్‌లో ఎమ్మార్పీస్ నాయకులు వల్లూరి సత్తిబాబు ఆధ్వర్యంలో మాల,మాదిగలు ఏకమైతే కాల గమనమే ఆగదా పోస్టర్స్‌లను ఆవిష్కరించారు. జనసేన పార్టీకి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎమ్మార్పీస్ నాయ కులు వల్లూరి సత్తిబాబు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు హామీ ఇచ్చిన కూటమికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

సోమవరంలో అగ్నిప్రమాదం

కిర్లంపూడి, మే 3: మండలంలోని సోమవరంలో పులగం వెంకటరెడ్డికి సంబంధించిన ఐదు ఎకరాల్లోని జామాయిల్, పామాయిల్, అరటి తోటలు దగ్ధమాయ్యయి. జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. ఎవరో సిగరెట్ కాల్చిన పీక తోటలో పడేయడంతో అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలిపారు.

పీవో, ఏపీవోలకు శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), మే 3: ఎన్నికల విధులకు నియమితులైన పీవో, ఏపీవోలకు రెండో రోజైన శుక్రవారం శిక్షణ కొనసాగింది. సిటీ ఆర్వో జె.వెంకటరావు పర్యవేక్షణలో పీఆర్ ప్రభుత్వ కళాశాలలో మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇచ్చారు. 250మందికి ఈవీఎం, వీవీ ప్యాట్ల నిర్వహణ, వాటి పనితీరు, ఎన్నికల విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కూటమితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం

ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 3: రాష్ట్ర ప్రగతి ఎన్డీయే కూటమితోనే సాధ్యమని ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. లంకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ చీకట్ల నారాయణరావు, పలువురు వైసీపీ కార్యకర్తలు వైసీపీని వీడి శుక్రవారం సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో లంపకలోవ సొసైటీ మాజీ అధ్యక్షుడు గొంతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు. బంగారయ్యపేటకు చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి ప్రత్తిపాడులో సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు గుండ్రాజు దివానం ఆధ్వర్యంలో బంగారయ్యపేట మాజీ సర్పంచ్ పల్లా వరాలబాబు, వార్డుమెంబర్ మాదాసు శ్రీధర్, మాదాసు రాంబాబు, కర్రి వెంకటేశ్వరరావు, పుణ్యమంతుల చినబాబు తదితరులు పార్టీలో చేరారు. అలాగే సిరిపురానికి చెందిన 40కుటుంబాలు వైసీపీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలోకి చేరారు. సత్యప్రభ కుమార్తె సత్యమాధురి లంపకలోవలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ధర్మవరంలో శుక్రవారం బుల్లితెర నటుడు ఇంద్రనీల్ వర్మ వరుపుల సత్యప్రభరాజా, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు, మాజీమండల ఉపాధ్యక్షులు బొల్లు కొండబాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు దాట్ల అప్పన్నబాబు, దాట్లకృష్ణబాబు, టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఇందన ఏసుబాబు, బొల్లు చొన్ని పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

ఏలేశ్వరం: వరుపుల సత్యప్రభ సమక్షంలో మండలంలోని తూర్పు లక్ష్మీపురానికి చెందిన బంకా వీరబాబు, మసిరపు రాంబాబు, వీరమళ్ల భూషణం, ఏగుపాటి వీర్రాజు, పోతల మనమ్మ, పోతల సత్యవతితోపాటు సుమారు 20కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నగర పంచాయితీ అప్పన్నపాలెంలో రౌతు సహదేవుడు ఆధ్వర్యంలో సుమారు 110మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, వైభోగుల సుబ్బారావు, బెల్లాని శ్రీను, బూర్లు సత్తిబాబు పాల్గొన్నారు. వరుపుల సత్యప్రభ, జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు మండలంలోని తూర్పు లక్ష్మీపురంలో ఇంటింటికీ తిరిగి కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. భద్రవరంలో సత్యప్రభ తనయుడు సాయి తర్శిత్ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జీ, వీరంరెడ్డి తాతబాబు, కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: బంగారయ్యపేటలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు టీడీపీనేత గుండ్రాజు దివాణం ఆధ్వర్యంలో వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ పల్లా వరహాలబాబు, మాదాసు శ్రీధర్, మాదాసు రాంబాబుతో 40కుటుంబాలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.





ప్రత్తిపాడు: ధర్మవరంలో ఇంద్రనీల్ వర్మ ప్రచారం, ఏలేశ్వరం: ప్రచారం చేస్తున్న సత్యప్రభ, తమ్మయ్యబాబు



ప్రత్తిపాడు: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

కూటమితోనే రాష్ట్ర పురోగతి

కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ



రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మే 3: సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అథోగతి పాలైందని, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, టీడీపీ-జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ద్వారా రాష్ట్రం పురోగతి సాధిస్తుందని కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కాకినాడ రూరల్ నేమాం, పోలవరం, పండూరు, తమ్మవరం, పెనుమర్తి, కొత్తూరు, వాకలపూడి, హార్బరుపేట గ్రామాల్లో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ రంగ వ్యవస్థలు నిర్వీర్యం చేశారని, ఐదేళ్ల సీఎం పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అన్ని వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు,పవన్‌లు ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటించారని, ఇది క్షేత్రస్థాయిలోని ప్రజల్లోకి వెళ్లిందన్నారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబు, ప్రజలకు సేవలచేయాలన్న అభ్యుదయ భావం కలిగిన పవన్ కలయికలో ఏర్పడిన కూటమి గెలుపు చారిత్రక అవసరమన్నారు. ముందుగా నేమాం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించి గాజు గ్లాసు గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, కటకంశెట్టి బాబీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పిల్లి బుజ్జి, కరెడ్ల గోవిందు, రంబాల వెంకటేశ్వరరావు, మాదారపు తాతాజీ, నండూరి సత్తిబాబు,కాళ్ల ధనరాజు ఉన్నారు.

జనసేనలో చేరికలు

కాకినాడ రూరల్ తమ్మవరానికి చెందిన వైసీపీ నాయకుడు గొల్లపల్లి సుబ్రహ్మణ్యం 20 మంది అనుచరులతో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. నేమానికి చెందిన వైసీపీ నాయకుడు రేవురాజు ఆధ్వర్యంలో 15 మంది, రమణయ్యపేట శివారు కొత్తూరు, బర్మా కాలనీకి చెందిన మామిడి మహేంద్ర మురళీ ఆధ్వర్యంలో 50 మంది పార్టీలో చేరారు. వీరికి పంతం నానాజీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, కార్యకర్తల కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటానన్నారు. సర్పవరం శివారు భావనారాయణపురంలో కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా నానాజీ కుమారుడు సందీప్‌తో కలసి టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి ఇంటింట ప్రచారం నిర్వహించారు.



జనసేనలో చేరినవారిని ఆహ్వానిస్తున్న పంతం నానాజీ



ప్రచారం నిర్వహిస్తున్న సత్యనారాయణమూర్తి, సందీప్

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'

జీజీహెచ్ (కాకినాడ), మే 3: మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ)పై తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ హెచ్చరించారు. కాకినాడ జిల్లా వైద్యఆరోగ్య కార్యాలయంలో ఎంటీపీపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎంటీపీ చేసే ఆస్పత్రులు తప్పనిసరిగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతినెలా చేసిన ఎంటీపీల వివరాలు తెలియజేసే జాబితాలను అందించాలన్నారు. జిల్లాలో కొత్తగా 18 ఆస్పత్రులకు ఎంటీపీ నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. సమావేశంలో గైనకాలిజస్ట్ డాక్టర్ అనురాధమ్మ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ జయదేవ్, పి.విజయషీల, డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారులు